


# కృషితో నాస్తి దుర్భిక్షం

ఉపేంద్ర రిక్షా దిగి ఇంటికొచ్చాడు. గేటు తీసుకొని లోపలికి వస్తూ ముఖద్వారానికి ఎడమప్రక్కన వున్న గదిలోకి తొంగి చూశాడు. రవి.. అప్పటిదాకా పుస్తకాల దొంతర చదివి చదివి అలిసిపోయాడేమో గుండెలమీద ఓ బరువైన పుస్తకం వుంది. కళ్ళు మూసుకొని నిద్రిస్తున్నట్లు కనిపిస్తున్నాడు. నిజానికి నిద్రపోతూ వుండి వుండడు. అలసిసొలసిన శరీరానికి కళ్ళు మూతలు పడిపోయి వుంటాయి.

ఉపేంద్ర రైల్వేలో పనిచేస్తున్నాడు. అతనో మిడిల్ క్లాస్ ఉద్యోగి. నలభై అయిదేళ్ళుంటాయి. ఇద్దరు కొడుకులు. పెద్దవాడు రవి. రెండేళ్ళక్రితం ఇంటర్ పాస య్యాడు. బైపీసీతో ఇంటర్ చదివిన రవికి ఎంసెట్ పరీక్షలో రెండుసార్లు వరుసగా అయిదంకెల ర్యాంక్ వచ్చింది. వాడు డాక్టర్ కావాలన్నది తన జీవిత ధ్యేయం. తను, భార్య ఇందిర ఇద్దరూ నూరిపోసిన ఫలితంగా రవి కూడా తను డాక్టర్వాలనే తీవ్రమైన కోరికతో వున్నాడిప్పుడు.

ఎంసెట్ పరీక్ష రెండు నెలల్లోకి వచ్చింది. లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంటున్నాడు. అయితే డే స్కాలర్గా రవి కష్టపడుతుండడానికి కారణం తన ఆర్థిక అస్థిరతే! పిల్లవాడిని హాస్టల్లో వుంచి చదివించే స్థోమతే లేని తను వాణ్ణి డాక్టర్ ఎలా చేయగలడో ఊహిస్తే భయమేస్తుంది. లక్షలు గుమ్మరించి ప్రయివేటు కాలేజీలో చదివించడం ఊహకందని విషయం. ఉపేంద్ర ఆలోచనాస్రవంతికి బ్రేక్ పడింది.

ఇందిర, "శివరామయ్య సిద్ధాంతిగారిని ఒకసారి కలవండి. వాడి జాతకంలో అసలు డాక్టరయ్యే యోగం వుందో లేదో! ఆయన చెప్పింది చెప్పినట్లు జరుగుతుందట, పక్కింటి పిన్నిగారు చెప్పారు" అంటూ ఉపేంద్రకు సలహా యిచ్చింది.

జ్యోతిష్యం గురించి చెప్పిన ఇందిర మాటలు ఉపేంద్రకు చిరుకోపం తెప్పించిన మాట నిజమే కానీ 'అయినా తప్పేముంది! వాడి జాతకం ఒకసారి సిద్ధాంతిగారికి చూపిస్తే పోలా! నష్టమైతే ఏమీ లేదు గదా?' అనుకున్నాడు.

"రేపు ప్రొద్దున వెళ్తాంలే!" అన్నాడు భార్యతో.

* * *

తెలతెలవారుతూండగా ఉపేంద్రకు రాత్రి ఇందిర చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. రవితో "బాబిగా! స్నానం చేసి కొంచెం రెడీకా! అలా శివరామయ్య మాస్టారుగారికి నీ జాతకం చూపించి వద్దాం!" అన్నాడాయన.

"అలాగే" అన్నాడు రవి.

అది ప్రశాంతమైన సుప్రభాత సమయం. మార్చి నెల చివరి రోజులు. అప్పుడప్పుడే భానుడు లోకానికి తన సత్తా చూపడానికి సన్నద్ధమవుతున్నాడు. తండ్రితో కలిసి రవి శివరామయ్యగారి యింటికి చేరుకొనేసరికి తొమ్మిది గంటలు కావస్తోంది.

"నాన్నగారు పూజలో వున్నారు కూర్చోండి" అంటూ చెరో కుర్చీ చూపించింది మెరుపుతీగలాంటి ఓ అమ్మాయి. నాన్నగారు అంటూ సంబోధించింది కాబట్టి ఆయన కూతురుగా తెలియడంతో కృతజ్ఞత తెలిపి ఆసీనులయ్యారు తండ్రీ కొడుకూ.

ఓ అరగంట తర్వాత వరండాలోకి వచ్చారు సిద్ధాంతిగారు. ఉపేంద్ర, రవి లేచి నమస్కారం చెబుతుంటే ఆయన కూర్చోమన్నట్లు సైగ చేసి వచ్చిన పని అడిగారు.

"మరేం లేదండీ! వీడు మా అబ్బాయి రవి. ఎంసెట్ పరీక్షకు తయారవుతున్నాడు. పరీక్ష రెండు నెలల్లోకి వచ్చింది. వీడిని డాక్టరు చేయాలన్నది మా దంపతుల ఆకాంక్ష! అదే వీడి జీవితాశయం కూడా! రెండుసార్లు రాసిన పరీక్షలో అలాంటి అవకాశం కనుచూపుమేరలో లేదని రుజువయింది. ఈసారి తీవ్రంగా కృషి చేస్తున్నాడు. మంచి రాంక్ వచ్చి గవర్నమెంటు కాలేజీలో చేరగలిగితే సేగానీ వాడి ఆశయం నెరవేరదు. ప్రయివేటు కాలేజీలో చదివించే స్తోమత నాకు లేదు. ఒకసారి వాడి జాతకం పరిశీలించండి" అంటూ సవినయంగా అభ్యర్థించాడు ఉపేంద్ర.

శివరామయ్యగారు రవి ముఖాన్ని పరిశీలనగా చూశారు. ధనవంతుల పిల్లలకు ఉండగల నీటయిన వస్త్రధారణగానీ, చక్కటి శరీరపోషణవల్లవచ్చే నాజూకుదనంగానీ లేకపోయినా అతనిలో ఎంతో వినయం, పరీక్ష పాసై లక్ష్యాన్ని సాధించాలనే పట్టుదల కనిపించాయాయనకు. అతనిపట్ల సదభిప్రాయం కలిగింది. పుట్టిన ఊరు, తేదీ, సమయం సమాచారం తెలుసుకొని అరగంటలో జాతకచక్రం వేశాడు. గ్రహ స్థితిగతులు పరిశీలించాడు.

"ఉపేంద్రగారూ! మీ అబ్బాయిది దివ్యమైన జాతకం. రాజ్యస్థానమైన దశమ భావంలో చంద్రశుక్రులు కలిసి వున్నారు. బలమైన శుభగ్రహాలు దశమాన్ని వీక్షిస్తున్నాయి. ఈ కారణంగా మీ అబ్బాయి డాక్టరవ్వడమే కాకుండా వృత్తిలో రాణిస్తాడు కూడా!" అన్నాడు.

ఉపేంద్రకు చాలా ఆనందం కలిగింది. ఒకటికి రెండుసార్లు అడిగి ఆ శుభవర్తమానం చెప్పించుకొని విని ఆనందించాడు. రవి కళ్ళలో కనిపిస్తున్న కాంతి చూసి ఉపేంద్ర ముగ్ధుడయ్యాడు. అబ్బాయికి వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్లయింది. శివరామయ్యగారికి దక్షిణ సమర్పించారు.

సిద్ధాంతిగారు "అఖండ విద్యాప్రాప్తిరస్తు!" అంటూ దీవించారు.

ఇద్దరూ ఆయనకు నమస్కారం చేసి ఇంటిదారి పట్టారు.

* * *

"సిద్ధాంతిగారు రవికి వైద్యవిద్యాయోగం వుందని చెప్పారు" అంటూ శుభవర్తమానం భార్యకు నివేదించాడు ఉపేంద్ర. అబ్బాయి ప్రిపరేషనుకు అవసరమయిన సమస్త సదుపాయాలు కలగజేశారు. రవి రోజు మొత్తం మీద ఐదారు గంటలు మాత్రమే నిద్రిస్తూ డే స్కాలర్గా కళాశాలలో చదువుతూ మెమొరీకి పదును పెడుతూ మంచి కసరత్తు చేస్తున్నాడు. తన జాతకంలో 'వైద్య విద్యాప్రాప్తం వుంది. తన కృషి లోపం వుండకూడదు' అనుకున్నాడు. అమోఘమయిన కృషి చేశాడు.


ఆరోజు రానే వచ్చింది. పరీక్షకు అటెండయ్యాడు రవి. సబ్జెక్ట్స్ ఛాయిస్లో తనకు బాగా వచ్చిన ప్రశ్నలు ముందు ఆన్సర్ చేశాడు. కొత్త అనిపించిన వాటిని చివరగా అటెంప్ట్ చేశాడు. మొత్తం మీద బాగా రాశాననే సంతృప్తితో హాలునుంచి బయటకు వచ్చాడు.

"బాగా రాశా నాన్నా! మరి లక్ ఎలా వుందో చూడాలి!" అంటున్న కొడుకును ఆప్యాయంగా చూశాడు ఉపేంద్ర. రోజులు ఉత్కంఠతో గడుస్తున్నాయి.

మరురోజు ఫలితాలని న్యూస్పేపర్లు ప్రకటించాయి. ఆ రాత్రి వారికి కంటిమీద కునుకుపడితే ఒట్టు! వెయ్యి దేవుళ్ళకు మొక్కుకొని రవి తన నంబరు కంప్యూటర్లో టైప్ చేశాడు.

ఆశ్చర్యం! నిజమో కలో తెలియదుగానీ రాంక్ మాత్రం మూడు అంకెల్లో కనబడుతోంది. తనను గిల్లి చూసుకున్నాడు. నిజమే! రవికి అయిదు వందల లోపు రాంక్ వచ్చింది. తనకు ప్రభుత్వ కాలేజీలో సీటు వస్తుంది. డాక్టరవ్వాలన్న తన కల నెరవేరబోతోంది.

ఆ రాత్రి రవికిగాని అతని తల్లిదండ్రులకుగాని నిద్రప



ట్టలేదు. ఆనందం వచ్చినా, దుఃఖం వచ్చినా అంతేనేమో! ఎవరో స్థితప్రజ్ఞులకు తప్ప సామాన్యుల సంగతి ఇంతే మరి! డజను యాపిల్స్, రెండు రకాల స్వీట్సు తీసుకొని ఉపేంద్ర, అబ్బాయితో శివరామయ్యగారింటికి బయలుదేరారు. ఆయన చెప్పిన జోస్యం నిజమయింది మరి! కృతజ్ఞతలు చెప్పుకోవాలి!! అప్పుడే అనుష్ఠానం పూర్తిచేసుకొని వరండాలో వాలుకుర్చీలో విశ్రాంతి తీసుకుంటున్న శివరామయ్యగారు గేటు చప్పుడు విని అటుగా చూడగా ఉపేంద్ర, రవి లోపలికి వస్తూ కనిపించారు. పండ్లు, మిఠాయిలు అందిస్తున్న వారితో "ఏమిటయ్యా ఇవన్నీ, ఏంటీ విశేషం?" అంటూ కుశలమడిగిన శివరామయ్యగార్కి పాదాభివందనం చేస్తూ రవి "ఎంసెట్‌లో మంచి ర్యాంక్ వచ్చింది మాస్టారూ! గవర్నమెంటు కాలేజీలో సీటు వస్తుంది. నా కల నిజం కాబోతోంది" అన్నాడు.

"మీ జోస్యం నిజమయింది సిద్ధాంతిగారూ" అంటూన్న ఉపేంద్రను చూసి పకపకా నవ్వుతూన్న సిద్ధాంతిగారిని అయోమయంగా చూశారు తండ్రీకొడుకులు.

"నా జోస్యం నిజం కావటం కాదోయ్! నీ కృషి రాణించింది. 'కృషితో నాస్తి దుర్భిక్షం' అని ఊరికే అన్నారా? నీ కృషికి తగ్గ ఫలితం లభించింది" అంటున్న శివరామయ్యగారి మాటలు అర్థం కాని వారికి విషయం వివరించారాయన.

"మీవాడి జాతక చక్రంలో దశమ భావంలో చంద్రశుక్రులున్నారనీ, వారిని శుభగ్రహాలు వీక్షిస్తున్నాయనీ, తత్ఫలితంగా మీ అబ్బాయి యోగ్యుడైన వైద్యుడవుతాడనీ చెప్పాను కదా? అదంతా అబద్ధం! జాతక చక్రంలో పరస్పర విరుద్ధమయిన స్థితి కనిపించింది నాకు. అలాగని దీక్ష, పట్టుదల, వినయ విధేయతలు ఉట్టిపడుతున్న మీవాడి ముఖంచూసి నిజం చెప్పలేకపోయాను. జాతకాన్ని ఆశాజనకంగా మార్చి మీ వాణ్ణి ఎంకరేజ్ చేశాను. అసలే పట్టుదల, కష్టపడే స్వభావం వున్న రవి చక్కగా చదివి మంచి రాంక్ తెచ్చుకున్నాడు. డాక్టర్ కాబోతున్నాడు. ఒక మంచి ప్రయోజనం కోసం జాతకాన్ని తారుమారు చేశాను. అలాగని జ్యోతిష శాస్త్రం అబద్ధం కాదు సుమా! భగవంతుని అనుగ్రహం లభించినప్పుడు గ్రహగతులు కూడా మారుతాయంటారు. వినయ విధేయతలు, కష్టించే స్వభావం, పట్టుదల వున్న మీ అబ్బాయికి ఆ భగవదనుగ్రహం లభించింది. మెడిసిన్‌లో ర్యాంక్ వచ్చింది. భవిష్యత్‌లో మంచి డాక్టరు కాబోతున్నాడు" పండ్లు, స్వీట్లు స్వీకరిస్తూ శివరామయ్యగారు "ఆల్ ద బెస్ట్" చెప్పగా కృతజ్ఞత నిండిన కళ్ళు ఆనందంతో చెమర్చడంతో తండ్రీ కొడుకులు అయోమయంగా ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.